## క్లుప్తంగా

### మద్యం తాగి నడుపొద్దు

ముథోల్: మద్యం తాగి వాహనాలను నడపవద్దని ముథోల్ ఎస్సై తిరుపతి అన్నారు. శుక్రవారం మండలంలోని భైంసా–బాసర రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని.. వాహనదారులు తప్పనిసరిగా అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. వారి వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

### ఉపాధి పనులు ప్రారంభం


కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

ముథోల్: మండలంలోని మచ్కల్‌లో శుక్రవారం ఉపాధిహామీ పనులను ఎంపీడీవో సురేశ్ బాబు, ఏపీవో శిరీష ప్రారంభించారు. ఈసందర్భంగా వారు కూలీలను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏపీవో మాట్లాడుతూ పొలాలకు వెళ్లే రోడ్డు పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీవో కూలీలకు పలు సూచనలు చేశారు. ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

### భూమిపూజ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ సమీపంలో రూ.ఐదు లక్షలతో నిర్మించే విశ్వబ్రాహ్మణ సంఘ భవనం నిర్మాణానికి శుక్రవారం జెడ్పీటీసీ చిన్నరామయ్య భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంరెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఫసి, రైతుబంధు సమితి నాయకులు కొంద్ర రమేశ్, గోపిడి గంగారెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సతీశ్, సభ్యులు మహేందర్, సదానందం, రవి తదితరులు పాల్గొన్నారు.

### చెక్కులు పంపిణీ

లోకేశ్వరం: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు తహసీల్దార్ సరిత.. షాదీముబారక్ చెక్కులు అందజేశారు. భూ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, నర్సింగ్‌రావు, అనిల్, సాయన్న, ఆర్ఐ బాలకిషన్ ఉన్నారు.

### సాయుధపోరాట యోధుడు చంద్రబోస్


నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా 45 ఏళ్ల అజ్ఞాత జీవితంతో సాయుధ పోరాటం చేసిన రాయల సుభాశ్ చంద్రబోస్ జీవితం అందరికీ ఆదర్శమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని విశ్రాంతి భవనం ఆవరణలో రాయల సుభాశ్ చంద్రబోస్ ఏడో వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆ పార్టీ నాయకులు సునారికారి రాజేశ్, కె.సర్దార్, గోపినర్సయ్య, విలాస్, లక్ష్మణ్, ప్రసాద్, గంగన్న, స్వామి తదితరులు ఉన్నారు.

### 'కంటివెలుగు' పరిశీలన

దస్తురాబాద్: కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని రేవోజీపేట గ్రామంలోని కంటివెలుగు వైద్యశిబిరాన్ని సందర్శించారు. అనంతరం మండలంలోని బుట్టపూర్ గ్రామంలోని హరితహారం నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నాగరాజు, ఆరోగ్య విస్తరణాధికారి వేణుగోపాల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం


ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

తానూరు: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం 23వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి ఉపాధ్యాయులకు, తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో మాధవ్‌రావ్ పటేల్, శివాజీపటేల్, భైంసా ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భోజారాం, కుభీర్ హెచ్ఎం వసంత్‌రావ్, కస్తూర్బా సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదర్శం.. కూరగాయల సాగు


రైతు క్షేత్రంలో సాగవుతున్న పాలకూర, కొత్తిమీర

- మూడెకరాల్లో 17 రకాల కూరగాయలు
- ఏటా రూ.ఆరు లక్షలు గడిస్తున్న శ్రీనివాస్
- తోటిరైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్న వైనం


చిక్కుడుకాయలు తెంపుతున్న కూలీలు

కుంటాల: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయలను సాగు చేస్తూ లాభాలు పొందుతున్నాడు కుంటాలకు చెందిన దోనిగమ శ్రీనివాస్ అనే రైతు. మూస ధోరణిలో కాక తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు సాగు చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. రోజువారీ ఖర్చులు పోవడంతోపాటు ఏడాది పొడవునా ఆదాయం వస్తుందని రైతు పేర్కొంటున్నాడు

**కుంటాలలో 17 రకాల కూరగాయలు ..**

కుంటాల–కల్లూర్ రహదారి పక్కన శ్రీనివాస్‌కు మూడు ఎకరాల భూమి ఉంది. దీనికి తోడుగా మరో మూడు ఎకరాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న భూమిలో సోయా, మొక్కజొన్న పంటలు సాగు చేస్తుండగా.. తన సొంత భూమి మూడెకరాల్లో 17 రకాల కూరగాయలు పండిస్తున్నాడు. వర్షాకాలంలో ఉల్లి, వెల్లుల్లి, మిరప నారును సైతం పెంచి ఇతరులకు విక్రయిస్తున్నాడు. సేంద్రియ ఎరువులు, జీవామృతం వినియోగిస్తూ పంటకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోకుండా సంరక్షిస్తున్నాడు.

**నష్టం వచ్చే పరిస్థితి ఉండదని..**

వివిధ కూరగాయలు పండించడం వలన ఒక పంటకు వచ్చిన తెగుళ్లు మరో పంటకు రావని చెబుతున్నాడు. కొన్ని కూరగాయలకు మార్కెట్‌లో డిమాండ్ లేకపోయినా మిగతా వాటికి మంచి ధర పలుకుతుండటంతో నష్టం వచ్చే పరిస్థితి లేదని ఈ రైతు చెబుతున్నాడు. ప్రణాళికతోపాటు వ్యవసాయాధికారుల సూచనలతో ముందుకెళ్తున్నట్లు పేర్కొంటున్నాడు.

**పండించే కూరగాయలివీ..**

టమాటా, వంకాయ, చిక్కుడు కూరగాయలను ఎకరంలో సాగు చేయగా.. మిగతా పంటలను రెండెకరాల్లో సాగు చేశారు. టమాటా, బెండ, పూవ్వుగోబి, మిరప, ఆకుగోబి, వంకాయ, చిక్కుడు, కాకర, బీరకాయ, క్యాప్సికంతోపాటు కొత్తిమీర, మెంతికూర, పాలకూర, గొంగూర, కొయ్‌గూర, క్యారెట్, ఆలుగడ్డ పంటను పండిస్తున్నారు.

**నెలకు రూ.50 వేల వరకు ఆదాయం..**

తాను పండించిన కూరగాయలను కుంటాలతోపాటు నిర్మల్, భైంసా, నర్సాపూర్(జి) మార్కెట్లలో విక్రయించి నెలకు రూ.50 వేల నుంచి రూ. 60వేల వరకు సంపాదిస్తున్నాడు. రోజు కూరగాయలు విక్రయిస్తూ రూ.1500 నుంచి రూ 2000 వరకు పొందుతున్నాడు. కుంటాలలో ప్రతి ఆదివారం నిర్వహించే సంతలో సుమారు రూ.5వేల వరకు అమ్మకాలు జరుపుతాడు. తద్వారా సంవత్సరానికి రూ.11 లక్షల ఆదాయం రాగా ఇందులో కూలీలు, ఇతర ఖర్చులు రూ. ఐదు లక్షల వరకు పోగా ఏటా రూ.6 లక్షల ఆదాయం వస్తుందని శ్రీనివాస్ వెల్లడించారు.

**రైతు క్షేత్రం సందర్శించిన ఎమ్మెల్యే..**


చిక్కుడుతోట పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విఠల్

సేద్యంలో ఆదర్శంగా నిలుస్తున్న శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరిశీలించి రైతును ప్రత్యేకంగా అభినందించాడు. ఇతర రైతులకు కూడా సాగుపై అవగాహన కల్పించాలని సూచించాడు.

**కష్టపడితే లాభాలే..**



రైతులు ప్రణాళికతో కష్టపడితే లాభాలు గడించవచ్చు. నాకున్న భూమిలో కూరగాయలు సాగు చేయడం వలన నెలకు రూ.50 వేల నుంచి 60వేల వరకు ఆదాయం వస్తుంది. దీంతో కుటుంబపోషణ, పిల్లల చదువులకు కొంత పోనూ మిగతాది పొదుపు చేస్తున్నా. అధికారుల సూచనలు పాటిస్తుండటం మేలు చేస్తుంది. ఆసక్తి ఉన్న రైతులు నా వ్యవసాయ క్షేత్రం సందర్శిస్తే అవగాహన కల్పిస్తా.

– దోనిగామ శ్రీనివాస్, కుంటాల

# ముగిసిన అఖండ హరినామ సప్తాహం

- ముగింపు వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే విఠల్ రెడ్డి


ప్రవచనం చెబుతున్న సమాదాన్ మహరాజ్


తరోడలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తానూరు: ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలు వీడి.. భక్తి మార్గంలో నడవాలని మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన సమాదాన్ మహరాజ్ అన్నారు. మండలంలోని మొగ్లి గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం శుక్రవారం ముగిసింది. చివరిరోజు కాళ్యకీర్తనలో పాల్గొని భక్తులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా వంద మందికి పైగా గ్రామస్తులు తులసీమాలలు ధరించారు. అనంతరం ఉట్టి కొట్టి ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మహరాజ్‌లను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం అన్నదానం చేశారు.

**భగవంతుడ్ని స్మరించుకోవాలి..**

ప్రతి ఒక్కరూ భగవంతుడ్ని స్మరించుకోవాలని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మొగ్లి గ్రామంలో సప్తాహం ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వారి వెంట సర్పంచ్ పుండలిక్, ఎంపీటీసీ లక్ష్మణ్, నాయకులు రాజన్న, పోతారెడ్డి, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

**సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

ముథోల్: మండలంలోని తరోడ గ్రామంలో శుక్రవారం రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులను, రూ.ఐదు లక్షలతో మురుగు కాల్వ పనులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించేందుకు ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ శ్వేత రవికిరణ్‌గౌడ్, ఎంపీటీసీ గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు అఫ్రోజ్‌ఖాన్, ఆరిఫొద్దిన్, మోహన్, గంగాధర్ తదితరులున్నారు.

# సావిత్రీబాయిపూలే సేవలు మరువలేనివి


భైంసాలో నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు



నిర్మల్‌లో బీసీ సంక్షేమ సంఘం నాయకుల నివాళి

భైంసాటౌన్: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా భైంసా అధ్యక్షుడు ప్రసంజిత్ అన్నారు. శుక్రవారం భైంసాలోని బుద్ధవిహార్‌లో సావిత్రీబాయిపూలే వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి నివాళులర్పించారు. ఏక్‌నాథ్, జల్బా, భుజంగ్‌రావు ఉన్నారు.

నిర్మల్‌టౌన్: సావిత్రీబాయి పూలే పోరాటం ఫలితంగానే మహిళలకు విద్య అందుతుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం భవనంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సిరికొండ రమేశ్, కిషన్, అశోక్‌చారి తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని మాఅమ్మ–నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. హథ్గాం ప్రాథమికోన్నత పాఠశాలలో పూలే వర్ధంతి నిర్వహించారు. పోశెట్టి, మోహన్, సుధీర్‌కుమార్, దీపక్, యోగేశ్, హథ్గాం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు వెంకటరమణ, నవీన్, సుదర్శన్, లింగన్న ఉన్నారు.

# రాత్రివేళ.. నిబంధనలకు పాతర.!





భైంసాటౌన్: ఇసుక అక్రమ తవ్వకం, తరలింపుపై అధికారులు నిబంధనలు కఠినతరం చేస్తూ మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల్లోపు రెవెన్యూ అధికారుల అనుమతితోనే ఇసుక రవాణా చేపట్టాలని ఇటీవల కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ట్రాక్టర్‌కు రూ.800 డీడీ చెల్లించి వేబిల్లు పొందాలని నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నారు. కానీ కొందరు అక్రమార్కులు రాత్రివేళ భైంసా మండలంలోని కామోల్, కథ్గాం వాగుల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. పొక్లెయిన్లతో వంతెన సమీపంలోనే ఇసుక తోడేస్తున్నారు. కుప్పలుగా పోసి రాత్రివేళ తరలించేస్తున్నారు. సంబంధిత అధికారులు నిఘా పెంచి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### వధువుకు మంత్రి ఆశీర్వాదం

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ సర్పంచ్ సుక్కు రాజవ్వ కుమార్తె వివాహం శుక్రవారం గ్రామంలోని ప్రియ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. మంత్రి ఐకేరెడ్డి కనకాపూర్‌లోని సర్పంచ్ ఇంటికి వెళ్లి వధువు సాన్విని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, అల్లోల సురేందర్‌రెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దళారులకు విక్రయించి మోసపోవద్దు

ముథోల్: రైతులు శనగ పంటను దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో మాట్లాడారు. ముథోల్‌లో 6,836 క్వింటాళ్ల శనగ పంటను, బాసరలో 3,709 క్వింటాళ్ల పంటను కొనుగోలు చేశామన్నారు. అష్టా కొనుగోలు కేంద్రంలో 5,97 క్వింటాళ్లను కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. విక్రయించిన వారి ఖాతాల్లో వారంలో డబ్బులు జమ చేస్తామన్నారు.

### చలివేంద్రం ప్రారంభం

కడెం: మండలకేంద్రంలో కొత్తమద్దిపడగ గ్రామస్తుడు దినేశ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ప్రారంభించారు. సదర్‌మాట్ కాలువ సాధన సమితి అధ్యక్షుడు రాజేందర్, కృష్ణ, ప్రవీణ్ ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌రూరల్ మండలం ఎల్లపెల్లిలోని 33కేవీ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని ఏడీఈ పి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 08:30 నుంచి 11గంటల వరకు నిర్మల్ పట్టణం, ఎల్లపల్లి, వెంకటాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెంబి: 33/11కేవీ విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శనివారం పెంబి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ సాయికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష్మణచాంద, మల్లాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

### నేడు చెక్కులు పంపిణీ

సారంగాపూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం మధ్యాహ్నం లబ్ధిదారులకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాధవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బస్తా ధర రూ.270 ఉందని.. ఆసక్తి కల్గిన రైతులు తమ ఆధార్, పట్టాదార్ పాస్‌పుస్తకాల జిరాక్స్‌లతో సంప్రదించాలని సూచించారు.

### రైతుబజార్‌లో..

| కూరగాయలు | కిలో(రూ.లో) |
|---|---|
| టమాటా | 15 |
| వంకాయ | 50 |
| బెండకాయ | 40 |
| పచ్చిమిర్చి | 60 |
| కాకరకాయ | 50 |
| బీరకాయ | 70 |
| క్యారెట్ | 80 |
| గోరుచిక్కుడు | 60 |
| కొత్తిమీర | 100 |
| అల్లం | 50 |
| ఎల్లిగడ్డ | 60 |
| ఉల్లిగడ్డ | 20 |
| ఆలుగడ్డ | 20 |

– నిర్మల్‌టౌన్

### సినిమాలు




తిరుమల : సార్
నారాయణ: బలగం

# మొక్కలకు నీరు అందించాలి


లోకేశ్వరం: మాట్లాడుతున్న ఎంపీడీవో సల్మాన్‌రాజ్

లోకేశ్వరం: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో నాటిన మొక్కలు ఎండిపోకుండా నీరందించాలని ఎంపీడీవో సల్మాన్‌రాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందికి, కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయాలన్నారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ తదితరులు ఉన్నారు.

**కుంటాలలో..**

కుంటాల: గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పల్లె ప్రగతి, హరితహారం, ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీవో రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి


వంటకాలు పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్ రాజు

నిర్మల్‌టౌన్: ఆరోగ్య జీవనం కోసం ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో మున్సిపల్‌శాఖ, మెప్మా ఆధ్వర్యంలో చిరుధాన్యాలు వాటి విలువలు, తెలంగాణ వంటల పోటీలు నిర్వహించారు. దీనికి చైర్మన్ హాజరై మాట్లాడారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి.వి.ఎన్ రాజు, సుభాశ్, టీఎంసీ సావిత్రి, మెప్మా, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'లిక్కర్ కేసును పక్కదారి పట్టించేందుకే ధర్నా'

భైంసాటౌన్: తనపై వచ్చిన లిక్కర్ స్కాం కేసును పక్కదారి పట్టించేందుకే ఎమ్మెల్సీ కవిత మహిళా రిజర్వేషన్ బిల్లు పేరిట ఢిల్లీలో బూటకపు ధర్నాకు దిగారని బీజేపీ నాయకులు పవార్ రామారావ్‌పటేల్ విమర్శించారు. శుక్రవారం భైంసాలో వారు మాట్లాడారు. కవితకు అరెస్టు భయం పట్టుకుందని.. తెలంగాణ ప్రజలు సకాలంలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. శ్రీనివాస్, సతీశ్, లక్ష్మణ్, సుదర్శన్ ఉన్నారు.

**అటెన్షన్ ప్లీజ్..**

### రోడ్డు డైవర్షన్ బోర్డులు ఏర్పాటు చేయరూ..




ఖానాపూర్: పట్టణంలో కొద్ది నెలలుగా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నా.. అనేక చోట్ల రోడ్డు డైవర్షన్ బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు రోడ్డు పనులు జరుగుతున్న గుంతల్లోకి వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి డైవర్షన్ బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రత్నాకర్‌రావు, మున్సిపల్ కమిషనర్ ఫోన్: 9440040793